# హరితహారం.. గొప్ప కార్యక్రమం

■ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్
■ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీపీవో కార్యాలయ ఆవరణలో హరితహారం.. పాల్గొన్న ఎస్పీ భాస్కర్


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పక్కన ఎస్పీ భాస్కర్

జగిత్యాల టౌన్, జూన్ 19: హరితహారం గొప్ప కార్యక్రమం అని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో హరితోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న డీపీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎస్పీ భాస్కర్ మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో మన కంటే 11 రాష్ట్రాలు పెద్దవి ఉన్నప్పటికీ అక్కలు మొక్కలు నాటే కార్యక్రమాలు జరగడం లేదన్నారు. ప్రపంచంలో సుమారు 200 దేశాలు ఉంటే ఒక చైనా, బ్రెజిల్ తప్ప ఎక్కడా ఇంత పెద్ద ఎత్తున మొక్కలు నాటలేదన్నారు. ఇప్పటి వరకు తెలంగాణలో 230 కోట్ల మొక్కలు నాటామన్నారు. ఇప్పుడు మళ్లీ 19.70 కోట్ల మొక్కలు నాటేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళిక రచించారని, ఇది పవిత్ర కార్యక్రమం కాదా అని అన్నారు. దశాబ్ది ఉత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారని కొంత మంది విమర్శిస్తున్నారని, రాష్ట్రంలో సుమారు 7 శాతం అడవుల పెంపకం జరిగిందని వారి కండ్లకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రంలో ఎన్ని నర్సరీలు, ఎన్ని మొక్కలు పెంచారో చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మొక్కల పెంపకంపై కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. ప్లాస్టిక్ నిషేధం విషయంలో కేంద్రం సహకరించడంలేదని చెప్పారు. ప్లాస్టిక్‌ను కాల్చడం వల్ల కాలుష్యం పెరిగి పర్యావరణంలో గణనీయమైన మార్పులు సంభవిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ అడవుల సంరక్షణలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారే కాకుండా పోలీసు డిపార్ట్‌మెంట్‌ను కూడా భాగస్వామ్యం చేయడంతో అడవుల విస్తీర్ణం పెరిగిందన్నారు. అన్ని పార్టీల వారిని దశాబ్ది ఉత్సవాల్లో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించామని, కానీ వారు పాల్గొనడంలేదని పేర్కొన్నారు. ఎస్పీ భాస్కర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. పర్యావరణంలో పెను మార్పుల వల్ల ఆరోగ్యంపై, పంటలపై విపరీతమైన ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. హరితహారంలో భాగంగా ఏటా మొక్కలు నాటుతున్నామన్నారు. ప్రజల సహకారంతో సామాజిక అటవీ పెంపకంలో జిల్లా పోలీసుల భాగస్వామ్యం ఉన్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు ఇప్పుడు పోలీసు డిపార్ట్‌మెంట్‌లో కూడా జిల్లాకు రెండు మూడు నర్సరీలను ఏర్పాటు చేసుకోమని చెప్పారన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు డిపార్ట్‌మెంట్‌లో మూడు నర్సరీలను ఏర్పాటు చేశామన్నారు. భావి తరాలకు అద్భుతమైన, భద్రమైన సమాజాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ శ్రీలత-రామ్మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ నరేశ్, డీఎస్పీ ప్రకాశ్, డీఈ రాజేశ్వర్, ఏవో శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ ఎల్ రమణ

జగిత్యాల, జూన్ 19: జిల్లా కేంద్రానికి చెందిన మహంకాళి రాజన్న అనే వ్యక్తికి మంజూరైన రూ.1.25 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ హైదరాబాద్‌లో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఎల్ కార్తీకేయ పాల్గొన్నారు.

## ఘనంగా సౌడాలమ్మ ఉత్సవాలు

సారంగాపూర్, జూన్ 19: రంగపేట గ్రామంలో సోమవారం సౌడాలమ్మ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనాపూర్ గ్రామంలో కార్యకర్తలను కలిసి మాట్లాడారు. కోనాపూర్ మున్నూరు కాపు సంఘ భవనానికి బ్యాలెన్స్ వర్క్‌కు రూ.2.50 లక్షలు, లక్ష్మీదేవిపల్లిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణం బ్యాలెన్స్ వర్క్‌కు రూ.2లక్షల ప్రొసీడింగ్స్ పత్రాలను అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కేంద్రంలో 21న జాబ్ మేళా

జగిత్యాల రూరల్, జూన్ 19: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 21న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బీ సత్తమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని జోషిత ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎల్‌ఎల్‌పీ (జే గ్రూప్) కంపెనీలో విత్‌ఔట్ టార్గెట్‌తో డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వేతనం రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. టెలీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 50 ఖాళీగా ఉన్నాయని, వేతనం రూ.15 వేల నుంచి రూ.25వేల వరకు ఉంటుందని వివరించారు. హైదరాబాద్‌లోని ఏపీ బయో ఫెర్టిలైజర్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 60 ఖాళీగా ఉన్నాయని, వేతనం రూ.9 వేల నుంచి రూ.15వేల వరకు ఉంటుందని, అలాగే టీఏ, డీఏ, కమీషన్ సైతం ఇస్తామని తెలిపారు. ఫీల్డ్ డెవలప్ మెంట్ ఆఫీసర్స్ పోస్టులు 4 ఖాళీగా ఉన్నాయని, రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనం, టీఏ, డీఏ, కమీషన్ అందిస్తారని తెలిపారు. హెచ్‌ఆర్‌ఎస్ పోస్టులు 2 ఖాళీగా ఉన్నాయని, రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు ఇస్తారని, ఆఫీస్ బాయ్ పోస్టు 1 ఖాళీగా ఉందని, వేతనం రూ.8 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుందని వివరించారు. 18- 40 సంవత్సరాలలోపు వయసు కలిగి, పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, డిప్లొమా, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు గల యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల వారు జాబ్‌మేళాకు హాజరు కావాలని, వివరాలకు 9666723356, 9963177056, 9182494837 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## పోలీసు శాఖను చేరువ చేయడానికే గ్రీవెన్స్ డే

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 19: పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతి సోమవారం గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సోమవారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్ డేను నిర్వహించారు. భూ సమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్, గల్ఫ్ ఛీటింగ్‌కు సంబంధించి 26 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. బాధితులకు సత్వర న్యాయం చేయాలని, ప్రతి ఫిర్యాదుకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేయాలని, ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సంబంధిత మండలాల పోలీస్ అధికారులను ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు.

## జగిత్యాల టౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 19: జగిత్యాల టౌన్ సీఐగా సీహెచ్ నటేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల టౌన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న రాంచదర్‌రావు కరీంనగర్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కాగా, కరీంనగర్ వన్ టౌన్ నుంచి బదిలీపై వచ్చిన నటేశ్ సోమవారం విధుల్లో చేరారు. అనంతరం ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## ఎమ్మెల్యేను కలిసిన సీఐ, ట్రాఫిక్ ఎస్ఐ

జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ నటేశ్, జగిత్యాల ట్రాఫిక్ ఎస్ఐ రాంచంద్రం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. జగిత్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ నటేశ్, జగిత్యాల ట్రాఫిక్ ఎస్ఐగా రాంచంద్రం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.

## జిల్లాలో ఇద్దరు ఎస్ఐల బదిలీ

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 19: జిల్లాలో ఇద్దరు ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఎగ్గడి భాస్కర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న పబ్బ కిరణ్‌ను కథలాపూర్‌కు, డీసీఆర్‌బీలో పనిచేస్తున్న పురుషోత్తంను జగిత్యాల టౌన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆలయాన్ని దేవాదాయశాఖలోకి తీసుకురావాలి

రాయికల్, జూన్ 19: పట్టణంలోని అతి ప్రాచీనమైన శ్రీ చెన్న కేశవ నాథ పంచముఖ లింగేశ్వర ఆలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ రాయికల్ పట్టణానికి చెందిన ప్రజలు, యువత సోమవారం మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సతీశ్, జగన్, కిరణ్, రాకేశ్, సంతోష్, మల్లేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## అనంతారంలో అంగన్‌వాడీ బడిబాట

జగిత్యాల రూరల్, జూన్ 19: అనంతారం గ్రామంలో అంగన్ వాడీ బడిబాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సీడీపీవో వీరలక్ష్మి పాల్గొని గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ చిన్నారులను అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ప్రీస్కూల్ పిల్లల నమోదు పెంచాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జీ జానకి, అంగన్ వాడీ టీచర్లు పీ పద్మజ, ఎం నర్సమ్మ, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైస్‌మిల్లుల వద్ద మొక్కలు నాటాలి

### జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత


మొక్క నాటుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల టవర్ సర్కిల్, జూన్ 19: రైస్‌మిల్లుల వద్ద తప్పనిసరిగా మొక్కలు నాటాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ సోమవారం సందర్శించి రైస్‌మిల్లుల వద్ద హరితహారం చేపట్టి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రైస్‌మిల్లుల వద్ద తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్ కుమార్, అధికారులు, సిబ్బంది, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# బీర్‌పూర్ సహకార సంఘంలో వందశాతం వసూళ్లు

### సంఘ చైర్మన్, సీఈవోకు ఘన సన్మానం


సన్మానిస్తున్న న్యాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి

సారంగాపూర్, జూన్ 19: బీర్‌పూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో వరుసగా 11 ఏండ్ల పాటు రుణ వసూళ్ల వంద శాతం చేస్తున్నందుకు సోమవారం కరీంనగర్‌లో జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మహజన సభలో సహకార సంఘం చైర్మన్, జిల్లా కేడీసీసీబీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, సీఈవో తిరుపతిని ఘనంగా సన్మానించారు. సహకార సంఘంలో రైతులు తీసుకుంటున్న రుణాలు ప్రతి సంవత్సరం సకాలంలో చెల్లిస్తుండడంతో సహకార సంఘ చైర్మన్ ముప్పాల రాంచందర్ రావు, సీఈవో తిరుపతిని న్యాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సహకార సంఘ అభివృద్ధికి సహకరిస్తున్న సంఘ సభ్యులు, పాలక వర్గ సభ్యులకు ముప్పాల రాంచందర్ రావు, సీఈవో కృతజ్ఞతలు తెలిపారు.

## ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్


జరిమానా విధిస్తున్న ఎంవీఐ రంజిత్

మారుతీనగర్, జూన్, 19: ఫిట్‌నెస్ లేని వాహనాలు సీజ్ చేస్తామని ఎంవీఐ రంజిత్ పేర్కొన్నారు. సోమవారం మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండల శివారుల్లో వివిధ ప్రాంతాల్లో రవాణా శాఖాధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలను చెక్ చేసి సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. అలాగే పట్టణంలో విద్యాసంవత్సరం ఆరంభమైన నేపథ్యంలో పలు పాఠశాలలకు చెందిన 15 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉందని, వెంటనే యాజమాన్యం ఆ బస్సులను వెంటనే ఫిట్ నెస్ చేయించుకోవాలని బస్‌డ్రైవర్లకు సూచించారు. కాగా తొమ్మిది స్కూల్ బస్సులను తనిఖీ చేసి రెండు స్కూల్ బస్సులతోపాటు ఆరు ఇతర వాహనాలను సీజ్ చేసి రూ.3 లక్షల జరిమానా విధించారు. ఇక్కడ ఆర్టీసీ డీఎం వేదవతి, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఊరి లోపలి నుంచి బస్సు నడపాలని వినతి

రాయికల్, జూన్ 19: కోరుట్ల నుంచి రాయికల్ వెళ్లే ఆర్టీసీ బస్సు మైతాపూర్ గ్రామం బయట నుంచి కాకుండా గ్రామం లోపలి నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు కోరుట్ల డిపో మేనేజర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బస్సు ఊరి బయటి నుంచి వెళ్లడం వల్ల గ్రామంలోని మహిళలు, విద్యార్థులు, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అజారొద్దీన్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వన్నెల వికాస్, మర్రిపెల్లి కాశీం, పోలాస వెంకటేశ్, ఇంద్రాల స్రుజన్, బేతి రాధ, పెద్దిరెడ్డి లింగవ్వ, దమ్మ చిన్న రాజవ్వ, దమ్మ రాధ, పడిగెల అమ్మాయి, పెద్దిరెడ్డి గంగు, కండ్లపెల్లి గీత, మరం లక్ష్మి, బొమ్మెన రాధ, బూస రాధ, బొమ్మెన రాధ తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు